క్లుప్తంగా

మేకల సంతను సద్వినియోగించుకోవాలి

ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

బంట్వారం: బంట్వారం మండల కేంద్రంలో నిర్వహించే మేకల సంతను వ్యాపారులు, రైతులు సద్వినియోగించుకోవాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 21వ తేదీన మేకల సంతను ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మేకలు, గొర్రెల కొనుగోలుదారులు, అమ్మకందారులు, వ్యాపారులు హాజరు కావాలని కోరారు. ప్రతీ శుక్రవారం మేకల సంత నిర్వహిస్తారని తెలిపారు. సమీప గ్రామాల వ్యాపారులు, రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా రమాబాయి అంబేడ్కర్ కమిటీ



రమాబాయి అంబేడ్కర్ నూతన కమిటీ సభ్యులతో రమేష్‌బాబు

కొడంగల్ రూరల్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీ 12వ వార్డులో గురువారం ప్రజా అంబేడ్కర్ తాలుకా అధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో రమాబాయి అంబేడ్కర్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పి మల్లమ్మ, ఉపాధ్యక్షురాలిగా జి భారతి, డి శిరీష, ఈ కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శిగా డి వెంకటమ్మ, సహాయ కార్యదర్శులుగా యు అంజమ్మ, డి అంజమ్మ, కోశాధికారిగా డి సరస్వతి, యూ అమృతమ్మలతోపాటు కల్చరల్ కార్యదర్శులు, సలహాదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షురాలు మల్లమ్మ మాట్లాడుతూ రమాబాయి చేసిన త్యాగాలను, ఆమె ఎదుర్కొన్న సమస్యలతోపాటు సాధించిన విజయాలను అందరికీ అవగాహన కల్పించేందుకు కృషిచేయనున్నట్లు తెలిపారు.

శ్రీశైలం పుణ్యక్షేత్రానికి తరలిన శివస్వాములు



శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరుతున్న శివస్వాములు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని హస్సేన్‌పూర్ గ్రామంలో గురువారం శివస్వాములు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి తరలి వెళ్లారు. ఉదయం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయ పూజారి గడ్డం అఖిలేశ్వర్ స్వామి ఆధ్వర్యంలో శివస్వాములు ఇరుముడి కట్టుకొని శ్రీశైలానికి వెళ్లారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

అంతారం గుట్టపై మార్మోగిన శివనామస్మరణం



శివపార్వతుల కల్యాణంలో భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం గుట్టపై ఉన్న శివాలయం వద్ద శివనామ స్మరణతో మార్మోగింది. గురువారం ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, గర్భగుడిపైన కలశం ఏర్పాటు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు, శివ స్వాములు పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో అంతారం గ్రామ ప్రజలు, శివస్వాములు పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

తాండూరు రూరల్: మండల పరిధిలో బెల్కటూర్ గ్రామంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సాగు.. భారమే!

- పెరిగిన పెట్టుబడులు
- యంత్రాల అద్దె రెట్టింపు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్న రైతు

దౌల్తాబాద్: పంటల సాగు రైతులకు భారంగా మారుతోంది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర అంతంతే ఉండడంతో అన్నదాతలు అప్పులపాలవుతున్నారు. వ్యవసాయ పరికరాల ధరలు గతేడాది కంటే ఈ సంవత్సరం 25శాతం పెరగడం, యంత్రాల అద్దె రెట్టింపవడంతో సాగు తలకుమించిన భారంగా తయారవుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఇంధన (పెట్రో ఉత్పత్తులు) ధరలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపిడంతో సన్న, చిన్నకారురైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారాయి. ఆధునిక వ్యవసాయ విధానంలో యంత్రాల వినియోగం తప్పని సరవుతున్నాయి. కానీ యంత్రాల నిర్వహణకు అవసరమైన డీజిల్, పెట్రోల్ ధరలు క్రమం తప్పకుండా పెరుగుతుండడంతో రైతులపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పెట్టుబడి పెరుగుతున్నాయి. ఈ క్రమంలో యంత్రాలపై వెచ్చించే ఖర్చు, అద్దెలు కూడా రెట్టింపవుతున్నాయి. పెరిగిన పెట్టుబడితో సతమతమవుతున్న రైతన్నకు ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి రాక దిగులు పడుతున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు.

సాగులో యంత్రాలే కీలకం

వ్యవసాయరంగంలో సుమారు దశాబ్దకాలంగా యంత్రాల వినియోగం పెరుగుతూ వస్తోంది. యంత్ర పరికరాలు లేనిదే పంటలు పండించలేని పరిస్థితిలోకి వచ్చేశారు. దీంతో ఈ విషయంలో రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. యంత్రాల వినియోగం కీలకంగా మారడంతో దుక్కిదున్నినప్పటి నుంచి పంటమార్పిడి వరకు యంత్రాలు లేకుండా ఏ పని ముందుకు సాగని దుస్థితి నెలకొంది. యంత్రాలు నడవడానికి ఇంధనం తప్పనిసరిగా మారింది. డీజిల్ ధరలు నిత్యం పెరుగుతుండడంతో యంత్రాల యజమానులు సీజన్‌కోసారి అద్దె ధరలు పెంచుతున్నారు.

పెరుగుతున్న ధరలు

డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్ యజమానులు సైతం ధరలు పెంచేస్తున్నారు. దుక్కి దున్నడానికి గంటకు రూ.1200నుంచి రూ.1400 వరకు తీసుకుంటున్నారు. పొలం దున్నడానికి గతంలో రూ.1200 ఉండగా, ప్రస్తుతం రూ.1800 వరకు తీసుకుంటున్నారు. దీంతో వ్యవసాయ పరికరాల ధరలు విపరీతంగా పెరిగాయి. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సబ్సిడీపై పనిముట్లు, చమురు ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కదిలిన అధికార యంత్రాంగం

- సమస్యల పరిష్కారానికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

దోమ: గ్రామాల్లో తిష్ట వేసిన సమస్యలను అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడంతో గురువారం సాక్షిలో ప్రత్యేక పాలన అస్తవ్యస్తం! అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మండల అధికార యంత్రాంగం కదిలింది. క్షేత్ర స్థాయిలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కలసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. ముఖ్యంగా పంచాయతీలోని ఆయా రికార్డులను పరిశీలించారు. తదనంతరం గ్రామాల్లో తిరుగుతూ మురుగు కాల్వల శుభ్రం, పరిసరాల పరిశుభ్రత, నీటి కొరతలాంటి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారు.



దోర్నాల్‌పల్లి రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వెంకట్

ప్రమాదపు అంచుల్లో ఆర్టీసీ ప్రయాణం

పరిగి: రోజురోజుకు ఆర్టీసీ ప్రయాణం ప్రమాదకరంగా మారుతుందని పలువురు వాపోతున్నారు. సరిపడ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిగి నుంచి షాద్‌నగర్ వెళ్లే బస్సులో గురువారం స్థాయికి మించి ఎక్కారు. ఫుట్‌పాత్‌పై కూడా నిలబడేందుకు స్థలం లేక పోవడంతో ఓ ప్రయాణికుడు బస్సు వెనుకాల క్యారిల్ పట్టుకుని ప్రయాణించాడు. ఫుట్‌పాత్‌పై కూడా ప్రయాణికులు నిలబడి ప్రయాణిండంతో ఆర్టీసీ బస్సు ప్రయాణం ప్రమాదకరంగా మారుతుందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఆర్టీసీలో ప్రయాణం ఇంత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్టీసీ బస్సులను పెంచాలని కోరుతున్నారు.

నమూనా ఇల్లు పనులు ప్రారంభం

తాండూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి నమూనా ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రతీ మండల హెడ్‌క్వార్టర్‌లో రూ.5 లక్షలతో ఇల్లు ఎలా నిర్మించాలనే ఉద్దేశ్యంతో నమునా ఇళ్లను నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా తాండూరు మండల ఎంపీడీఓ కార్యాలయం వద్ద నమూనా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. 400 స్క్వేయర్ ఫీట్‌లో సింగిల్ బెడ్‌రూం, కిచెన్, హాల్‌తో పాటు వాష్‌రూం నిర్మించనున్నారు. హౌసింగ్ డీఈఈ ఖలీమ్, ఏఈ రహీమ్‌లు నమూనా ఇంటి నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. బేస్‌మెంట్ కట్టగానే ప్రభుత్వం రూ.1లక్ష లబ్ధిదారుడి ఖాతాలో వేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మార్చి తర్వాత మరో 3500 ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రకటించారు. దీంతో గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో మొదటి విడతగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.



ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా ఇల్లు

బషీరాబాద్ ఎస్‌ఐ శంకర్ దాతృత్వం

శ్రీరామ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



ఎస్‌ఐ శంకర్

బషీరాబాద్: బషీరాబాద్ ఎస్‌ఐ శంకర్ దాతృత్వాన్ని చాటుకున్నాడు. మండల కేంద్రంలోని టాకి తండాకు చెందిన రాథోడ్ వెంకటేశ్ కొడుకు రాథోడ్ శ్రీరామ్ బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదంలో మృతి చెందిన శ్రీరామ్ కుటుంబానికి ఎస్‌ఐ శంకర్ గురువారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతుని తల్లిదండ్రులు ఎస్‌ఐ శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు పాంబండపై టెంకాయల వేలం

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో సంవత్సర కాలపరిమితికిగాను శనివారం టెంకాయల వేలాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద జాతర, శివరాత్రి మినహాయించి సంవత్సరకాలానికి ఆలయ ప్రాంతంలో టెంకాయలు అమ్ముకునేందుకు ఆసక్తి గల వ్యక్తులు హక్కులను పొందేందుకు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు ఆలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

పెద్దేముల్ కార్యదర్శిగా లాలప్ప



లాలప్ప

తాండూరు రూరల్: పెద్దేముల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా లాలాప్పను నియమించారు. గతంలో కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ పెద్దేముల్‌కు ఇన్‌చార్జిగా పని చేశారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో భాగంగా కొటబాసుపల్లి గ్రామ కార్యదర్శిగా పని చేసిన లాలప్పను పెద్దేముల్‌కు బదిలీ చేశారు. గురువారం లాలప్ప బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పెద్దేముల్‌కు ఇన్‌చార్జి కార్యదర్శులే పని చేశారు. ఇక నుంచి లాలప్ప పూర్తిస్థాయి కార్యదర్శిగా పని చేయనున్నారు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం



ఇళ్ల ఎదుట పారుతున్న మురుగునీరు

- మొయినాబాద్‌లో రోడ్డుపైనే పారుతున్న మురుగు
- దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీలో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సరైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. మున్సిపల్ కేంద్రంలోని భరద్వాజ్ కాలనీ, సహారా కాలనీ, విజయనగర్ కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఏర్పాటు చేయలేదు. ఆయా కాలనీల లేఅవుట్ చేసినప్పుడే వెంచర్ చేసినవారు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు వేయాల్సి ఉన్నా అప్పట్లో అవేవి పట్టించుకోలేదు. లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న తర్వాత ఇబ్బందులు మొదలయ్యాయి. ఆయా కాలనీల్లో గత ఐదేళ్లలో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు అధికంగా జరిగాయి. ఆ ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరంతా రోడ్లపైన, రోడ్ల పక్క నుంచి కాలువలుగా పారుతోంది. దీంతో దుర్వాసన, ఈగలు, దోమలతో రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కేంద్రంలోనే ఇంత అధ్వాన పరిస్థితి ఉన్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి వ్యవస్థ సరిచేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని కోరుతున్నారు.



రోడ్డు పక్క నుంచి కాల్వలా పారుతున్న మురుగునీరు

గ్రామాభివృద్ధికి కృషి చేస్తాం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బీసీ సేనా జిల్లా అధ్యక్షుడు పాండుగౌడ్

చేవెళ్ల: ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బీసీ సేనా జిల్లా అధ్యక్షుడు జూలూరి పాండుగౌడ్ అన్నారు. మండలంలోని కుమ్మెర గ్రామంలో గురువారం రూ.15లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. సీసీరోడ్ల కోసం ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో నిధులు మంజూరయ్యాయన్నారు. గ్రామాభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామంలో సమస్యలు లేకుండా చేస్తామన్నారు. అన్ని కాలనీల్లో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాలు పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కావలి శంకర్, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్, గ్రామస్తులు వీరేశం, రాంచందర్, కృష్ణ తదితరులు ఉన్నారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

23న గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రిన్సిపాల్ విద్యుల్లత

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందేందుకు ఈ నెల 23న(ఆదివారం) ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని కమ్మదనం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత తెలిపారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాలలో ఆమె మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఐదో తరగతి ప్రవేశాల కోసం వీటీజీ సెట్, 6, 7, 8, 9వ తరగతుల ప్రవేశాల కోసం బీఎల్‌వీ సెట్ పరీక్షను రాయాల్సి ఉంటుందన్నారు. కమ్మదనం గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం 10 గంటల వరకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టికెట్, బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్, బోనోఫైడ్, ఆధార్‌కార్డు, పరీక్ష ప్యాడ్ తప్పనిసరిగా తమ వెంట తీసుకొని రావాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు(వాచ్, సెల్ ఫోన్, కాలిక్యులేటర్) అనుమతించమని తెలిపారు. పరీక్షా కేంద్రానికి వచ్చేవారు షాద్‌నగర్ బస్టాండ్ నుంచి కమ్మదనం బైపాస్ మీదుగా బస్సు, ఆటోలలో సిల్క్ ఫాం పక్కన ఉన్న కమ్మదనం గురుకుల పాఠశాలకు చేరుకోవచ్చని సూచించారు. పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు పరీక్షా కేంద్రం వద్ద కళాశాల సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విద్యుల్లత

రాష్ట్రంలో ప్రజాసంక్షేమ పాలన

షాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని తాళ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సమ్మి పెంటయ్య, మారుగళ్ల నర్సింలు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీకి కార్యకర్తలే బలమని, బలోపేతానికి నిరంతరం పనిచేయాలని సూచించారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు కేంద్రంలో బీజేపీ అండగా నిలిచిందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండు ఒక్క తాను ముక్కలేనని ఢిల్లీలో దోస్తీ, గల్లీలో లొల్లి చేస్తూ నాటకాలు చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, మాజీ సర్పంచ్‌లు మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బార్ల యాదయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అతిథిగృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలి



ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న నాయకులు

- బీజేపీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి

చేవెళ్ల: ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన చేవెళ్లలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని(గెస్ట్ హౌస్‌ను) మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన బీజేపీ యువ నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డితో కలిసి శిథిలావస్థలో ఉన్న చేవెళ్ల ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఎంతో మంది ప్రముఖులు, అధికారులు, నాయకులకు ఆతిథ్యం అందించిన ఈ వసతిగృహాన్ని ఇప్పుడు పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. నిజాం కాలంలో ఆనాడు నిజం ప్రభువు గుర్రపు స్వారీపై వెళ్తూ మధ్యలో సేద తీరేందుకు కట్టించుకున్న ఈ భవనమే ఆ తర్వాత ఆర్‌అండ్‌బీ పరిధిలో గెస్ట్ హౌస్‌గా కొనసాగుతూ వచ్చిందన్నారు. ఇన్నేళ్ల ఈ ప్రభుత్వాల పాలనలో కొత్తగా ఎలాంటి గెస్ట్‌హౌస్ కట్టకపోగా ఉన్న దానిని నిరుపయోగంగా మార్చారని మండిపడ్డారు. చేవెళ్ల అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో ఎవరైనా ప్రముఖులు వస్తే కనీసం ఆతిథ్యం ఇచ్చేందుకు గెస్ట్‌హౌస్ అనేది లేకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. చేవెళ్ల హెడ్‌క్వార్టర్‌లోనే గెస్ట్‌హౌస్‌కు ఇలాంటి పరిస్థితి ఉంటే ఇది ప్రభుత్వ పాలన తీరుకు అద్దంపడుతుందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి గెస్ట్‌హౌస్‌ను బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జయసింహారెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పంచాయతీ రోడ్లకు మహర్దశ



మోమిన్‌పేటలోని ఎన్కేపల్లి పంచాయతీ రోడ్డు

- రహదారి మరమ్మతులకు రూ.4.42కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా గుంతలమయంగా తయారయ్యాయి. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో బీటీ, రీ బీటీకి రూ.4.42కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో మండల పరిధిలో ఆయా గ్రామాల్లోని రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఎన్నో ఏళ్లుగా గుంతల రోడ్లపై ప్రయాణించిన వాహనాదారులు, ప్రయాణికులు ప్రస్తుతం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి పంచాయతీ రోడ్డు 1.4కిలో మీటరు బీటీ లేసిపోయింది. దీంతో అది పూర్తిగా గుంతలుగా మారింది. ఈ రోడ్డు పనులకు ప్రభుత్వం రూ.67లక్షలను మంజూరు చేసింది. చక్రంపల్లి పంచాయతీ రోడ్డుకు రూ.45లక్షలు రీ బీటీ వేసేందుకు ఎంఆర్ఆర్ గ్రాంటు కింద, దేవరంపల్లి గ్రామానికి రూ.30లక్షలతో రీ బీటీ వేసేందుకు నిధులు మంజూరు చేసింది. మొరంగపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి బిక్కారెడ్డి గూడెం మీదుగా మర్పల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు మూడు కిలోమీటరు వరకు బీటీ వేసేందుకు రూ.3కోట్లు సీఆర్ఆర్ గ్రాంటు కింద పనులు ప్రారంభించనున్నారు. మర్పల్లి మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు ఎన్కేపల్లి మీదుగా వెళ్తే 5కిలోమీటరు కలిసి వస్తుంది. అదేవిధంగా బిక్కారెడ్డిగూడెం మీదుగ మర్పల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలకు మూడు కిలో మీటర్ల దూరం తగ్గుతుంది. ప్రయాణించాల్సిన దూరం తక్కువ కావడంతో పెట్రోల్, డీజిల్ ఆదా అవుతుందని వాహనాదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బీటీ, రీ బీటీ వేసేందుకు నిధులు మంజూరు చేయించేందుకు ప్రయత్నించిన నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలో రహదారుల విస్తరణ



కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్లకు పెద్ద పీట వేస్తుంది. మండల పరిధిలోని అన్ని గ్రామాలకు ఉన్న లింకు రోడ్లు బీటీగా మారనున్నాయి. త్వరలో వికారాబాద్ నుంచి మోమిన్‌పేట మీదుగా సదాశివపేట వరకు, శంకర్‌పల్లి నుంచి మోమిన్‌పేట మీదుగా బుద్దేరా వరకు, మొరంగపల్లి నుంచి తాండురు వరకు, కోటపల్లి నుంచి మర్పల్లి వరకు నాలుగు వరుసల రోడ్డును విస్తరించేందకు తగిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపడంతో అవి పరిశీలనలో ఉన్నాయి. త్వరలో వాటికి కూడా నిధులు మంజూరు కానున్నాయి. మోమిన్‌పేటలోని సెంట్రల్ లైటింగ్ సిస్టానికి అదనపు నిధుల మంజూరునకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఈ రోడ్లకు నిధులు మంజూరయితే మోమిన్‌పేట రూపు రేఖలు మారనుంది.

– శంకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు